క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కాకినాడ అంజున కంటి ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యే కంటి రోగులు ఆధార్, రేషన్ కార్డులు వెంట తీసుకురావాలని తెలియజేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఉచితంగా కాకినాడ తరలించి ఆపరేషన్లు చేస్తారన్నారు. వైద్య శిబిరానికి హాజరుకావాలని సూచించారు. ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న పీసా కమిటీ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ తదితరులు

గంగవరం : గ్రామంలోని ప్రతీ ఇంటా అవకాశం ఉన్నచోట విరివిగా మొక్కలను నాటాలని ఇందుకు స్థానిక యువసేన సభ్యులకు తగిన సహాయ సహకారాలు గ్రామపెద్దలు, యువకులు, ఉద్యోగులు అందించాలని గ్రామ పీసా ఉపాధ్యక్షుడు పి.శివరామకృష్ణ, వార్డు సభ్యుడు శివదొర అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పాత బ్యాంక్ వీధితో పాటు పలుచోట్ల గంగవరం యువసేన యువకులతో కలసి ఆదివారం మొక్కలను నాటారు. మొక్కలు నాటడంతో పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను ఇక ముందు కూడా కొనసాగించాలని ఇందుకు తగిన ప్రోత్సాహం ఇస్తామన్నారు. నవీన్, నరేష్, సన్ని, వీరాస్వామి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలోజీ నాయక్

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహనీయుల త్యాగాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాంసెఫ్ సంస్థ నిర్వాహకుడు బాలోజీ నాయక్ మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల త్యాగాలు మరవులేనివన్నారు. యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజ్యాంగం గురించి ఆయన వివరించారు. బంసెఫ్ కేడర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేనకపూలే, జైభీమ్ ఫౌండేషన్ ఎస్.కోటేశ్వరరావు బృందాలు, విద్యార్థులు,అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజా సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

22న వైఎస్సార్‌సీపీ సమావేశం


పరశురామ్

దుంబ్రిగూడ: మండల కేంద్రంలో మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ


జగ్గవరంలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నపరాజు

కూనవరం: వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని ఎటపాక సీఐ కన్నపరాజు అన్నారు. మండల పరిధిలోని జగ్గవరం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, హెల్మెట్ లేనివారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగం పనికిరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రైనీ ఎస్‌ఐ జి.దివ్య, కానిస్టేబుల్ సత్యనారాయణ, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.


డి.గొందరూలో రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు


తుంపాడ రేషన్ డిపో వద్ద పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

సమస్యలతో సతమతం

- ప్రమాదకరంగా డోకులూరు కల్వర్టు
- అసంపూర్తిగా కల్వర్టుతో అవస్థలు
- డి.గొందూరులో కానరాని జంగిల్ క్లియరెన్స్
- తుంపాడలో అధ్వానంగా రేషన్ డిపో

పాడేరు రూరల్: మండలంలో డోకులూరు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రధాన కల్వర్టు ప్రమాదకరంగా మారింది, గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా కోతకు గురైంది. ఈ మార్గంలో ఇరువైపులా రక్షణ గోడ కూడ లేకపోవడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. నిత్యం రాత్రి పగలు ఈ రహదారి మీదుగా వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోతకు గురైన కల్వర్టును బాగు చేయడంతో పాటు ఈ మార్గంలో రక్షణ గోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో గల దారెల పంచాయతీ పేటమాలిపుట్టు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు గత కొన్ని నెలలుగా అసంపూర్తిగా ఉంది. దీంతో పేటమాలిపుట్టు, డి.కుమ్మరిపుట్టు గ్రామాలకు చెందిన గిరిజనులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కల్వర్టు పనులు


డోకులూరు వద్ద ప్రమాదకరంగా మారిన కల్వర్టు

80 శాతం వరకు పూర్తి చేసి, కల్వర్టుకు ఇరువైపులా మట్టిని పూడ్చి, సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసి ఏడాదిపైగా కావస్తుంది.అతికష్టం మీద ద్విచక్ర వాహనచోదకులు దాటిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఆటోలు, జీపులు, వ్యాన్లు, కార్లు మాత్రం అసంపూర్తి కల్వర్టుతో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పనులు పూర్తిచేసి, సమస్య పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందన కరువైందని, తక్షణమే కల్వర్టును పూర్తి చేయాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

పాడేరు రూరల్: మండలంలో డి.గొందరూ నుంచి డోకులూరు పంచాయతీ కేంద్రం వరకు ఉన్న రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. తుప్పలు బాగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం ఉండడం లేదంటున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రమాదాలు జరగకుండా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా బాగా పెరిగి ఉన్న పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించాలని వారు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న పేటమాలిపుట్టు కల్వర్టు

పాడేరు రూరల్: మండలంలో తుంపాడ పంచాయతీ కేంద్రం వద్ద ఉన్న రేషన్ డిపో అధ్వానంగా మారింది, భవనం వినియోగంలో ఉన్నా నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా చెత్తా చెదరంతో పాటు పిచ్చి మొక్కలు పేరుకుపోయి డిపో పరిసరాలు దారుణంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. డిపో ప్రాంగణంలో పిచ్చిమొక్కలు బాగా పెరిగాయని, దీంతో విషసర్పాలు, తేళ్లు, జర్రెలు వంటివి సంచరిస్తున్నాయని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు బాగా కురువడంతో డిపో పరిసరాల్లో తుప్పలు మరింత పెరిగాయని, సరుకులు పొందేందుకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. డిపో నిర్వాహకుల నిర్లక్ష్యంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డిపో పరిసరాలు అధ్వానంగా మారాయంటున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

డ్రోన్ సహాయంతో గంజాయి సాగు గుర్తింపు


డ్రోన్‌ను వినియోగిస్తున్న పోలీసు సిబ్బంది

దుంబ్రిగుడ: మండల పరిధిలోని అనుమానిత ప్రాంతాల్లో గంజాయి సాగును డ్రోన్‌ల ద్వారా గుర్తించనున్నట్టు ఎస్‌ఐ కె.పాపినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ సహాయంతో గంజాయి సాగు జాడలపై ఆరా తీశామని, నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, అందరూ వాటికి దూరంగా ఉండాన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

ఎటపాక: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. ఆదివారం పట్టుచీర గ్రామంలో ఆదివాసీ హక్కులపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో పనిచేసే కొందరు అధికారులు గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నారని అటువంటి అధికారులకు ఇక్కడ పనిచేసే అర్హతలేదన్నారు. మండల అధ్యక్షుడు తెల్లం సత్యనారాయణ, చెల్లమ్మ, వెంకయ్య, భద్రయ్య, రాజేష్ తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వం ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులు

వి.ఆర్.పురం కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచర్ల గంగులు చెప్పారు. సర్పంచ్ పిట్టా రామారావు అధ్యక్షతన రామవరం చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలో చింతరేవుపల్లి గ్రామంలో పార్టీ నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక తప్పుడు అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు అమ్మఒడి పేరుమార్చి తల్లికి వందనం అని చెప్పి తల్లులకు పిల్లలకు కరెంటు బిల్ పేరుతో పంగనామం పెట్టారన్నారు. ప్రజాసంక్షేమాన్ని, పథకాలను గాలికి వదిలేసారన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ జాడ లేదన్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఉచిత బస్సు, ప్రతి మహిళకు రూ.15000 ఎక్కడ అని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని మోసం చేశారన్నారు. భర్త చనిపోతే భార్యకు పెన్షన్ కూడా ఇవ్వలేని అసమర్థ పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు పునరావాస, పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించే దమ్ములేక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మీ, సర్పంచ్ వద్దాణపు శారద, ఉప సర్పంచ్ ముంజపు రాము, పీసా కమిటీ ఉపాధ్యక్షులు కోటం జయరాజు, మాడి ముత్యాలరావు, ఆర్టీఐ జిల్లా విభాగ అధ్యక్షులు బోడ్డు సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ముత్యాల మురళీ, పార్టీ మండల మాజీ కన్వీనర్ పోడియం గోపాల్, నాయకులు కోట్ల శ్రీను, చీమల కాంతారావు, మోడం నరేష్, మాచర్ల వెంగళరావు, వద్దాణపు రాజారావు, బంధం రాజు, గూటల ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు

అంబులెన్స్ మరమ్మతుకు ఆర్థిక సాయం


అంబులెన్స్ మరమ్మతుకు ఆర్థిక సాయమందిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి(అరకులోయటౌన్): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మరమ్మతుకు గురైన అంబులెన్స్ రిపేరు చేసేందుకు అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, అయితే 104, 108 అంబులెన్స్‌లకు ఫోన్ చేసినా అందుబాటులో లేదని సంబంధిత అధికారులు సమాధానం ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో అనంతగిరి పీహెచ్‌సీలోని అంబులెన్స్ రిపేర్ అయినట్టు డాక్టర్ జ్ఞానేశ్వరి తెలిపారన్నారు. దీంతో గిరిజన రోగులకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ అందుబాటులో ఉండాలన్న సదుద్దేశ్యంతో అనంతగిరి పీహెచ్‌సీలోని అంబులెన్స్ రిపేర్‌కు రూ. 6 వేలను డాక్టర్ జ్ఞానేశ్వరికి అందజేశానన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కిల్లో మొష్యా, గిరిజన సంఘం నాయకులు నరాజీ సురేష్‌బాబు, అర్జున్ నాగేశ్వరరావు, రాజు, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


సర్పంచ్ చిలుకమ్మను పరామర్శిస్తున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


వైఎస్సార్‌సీపీ నాయకుడు పండన్నను పరామర్శిస్తున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ సర్పంచ్ మాతే చిలుకమ్మ, సింగర్బ పంచాయతీ రచ్చపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సెగ్గెకి పండన్న గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు, అందుతున్న వైద్యం తదితర ఆరోగ్యపరమైన సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ సీదరి కొండబాబు, సొలభం ఎంపీటీసీ చిన్నారావు, రాష్ట్ర విద్యార్థి విభాగం మాజీ కార్యదర్శి వెంకటరమణ, జెసిఎస్ మండల కన్వీనర్ కళ్యాణం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, వంజరి సచివాలయ కన్వీనర్‌లు రాజు, ప్రవీణ్ సాయి తదితరలు పాల్గొన్నారు.

గెడ్డపై వంతెన నిర్మించండి

భీరం గ్రామస్తుల విన్నపం


భీరం–దిగభీరం మధ్య వర్షపు నీటితో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న గెడ్డ

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ కేంద్రానికి–దిగభీరం గ్రామానికి మధ్య పెద్దగెడ్డ వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తుండడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు చదువుకు వెళ్లలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో కొద్దిపాటి వర్షం కురిసినా గ్రామాల మధ్య ఉన్న గెడ్డ ప్రమాదకరంగా వర్షపునీటితో ప్రవహిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో భీరం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చిన్నారులు చదువుకు వెళ్లలేకపోతున్నారన్నారు. ఈ గ్రామాల మధ్య గెడ్డపై వంతెన నిర్మాణానికి పలుమార్లు ప్రభుత్వం, ఉన్నతాధికారులకు విన్నవించినా కనీస చర్యలు చేట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భీరం–దిగభీరం గ్రామాల మధ్య గెడ్డ ఉండగా, 1కిలోమీటరు దూరం ఉంటుందని విద్యార్థులు కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. వర్షాకాలంలోను, విపత్తుల వలన వచ్చే తుఫాను వర్షాలకు గెడ్డ పొంగి ప్రవహిస్తే ఆ రోజుల్లో ఇళ్ల వద్దనే ఉండిపోవడంతో విద్యాపరంగా పిల్లలు నష్టపోతున్నారన్నారు. గ్రామాల మధ్యగెడ్డ ప్రమాదకరంగా వర్షపునీటి ప్రవహిస్తుండడంతో గెడ్డ దాటటానికి విద్యార్థులు సాహసించలేక పక్కన 3కిలోమీటర్లు దూరంలో ఉన్న తాడేవిధి, అనర్బ గ్రామాల్లో గల పాఠశాలలకు అనేక ఇబ్బందులు పండుతూ కాలినడకన వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్‌రావు దంపతులు ఆదివారం ఇక్కడ అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పంచదార, తేనె పసుపు కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


అడ్డతీగల సీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


అడ్డతీగల పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో తుప్పలు తొలగిస్తున్న ఎస్‌ఐ వినోద్, సిబ్బంది

అడ్డతీగల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యతగా తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య నిర్మూలన, ప్లాస్టిక్ వినియోగం మానుకోవడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. పరిసరాల్లో మొక్కలు నాటడంతో పర్యావణానికి ఎంతో మేలు జరుగుతుందని ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు అన్నారు.అనంతరం ఆస్పత్రి సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్యులు అనూష, ఆయుర్వేద వైద్యులు షేక్ రేష్మ సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద

అడ్డతీగల పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ వినోద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల్లో తుప్పలను తొలగించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

సిరులు కురిపిస్తున్న వెదురు కొక్కులు


పుత్తడిగొంది గ్రామంలో వ్యవసాయ భూమిలో వెదురు కొక్కులు


వెదురు కొక్కులు

జి.మాడుగుల: ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గిరిజనులకు వెదురు కొక్కుల'పంట'పండింది. జి.మాడుగుల మండలంలో పలు ప్రాంతాల్లో గిరిజన రైతులకు చెందిన పంట భూములు(గరువులు)పోడు వ్యవసాయ భూముల్లో వెదురు తోటల్లో వెదుళ్లు నరికి వేయగా మిగిలిన మొదళ్లు కుళ్లిపోయిన చోట్ల వెదురుకొక్కులు పంట విరివిగా వస్తుందని రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో గల అన్ని వర్గాల ప్రజలు వెదురు కొక్కులను వేపుడు, కూరగా చేసుకొని భోజనంలో వినియోగిస్తారు. వెదురు కొక్కులు ఎంతో రుచికరంగా, మెత్తని మాంసాహారంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వెదురు తోటలు ఉండి నరికివేసినప్పుడు భూమిలో మోడులు ఉన్న చోట వర్షాకాలంలో ఎక్కువగా లభిస్తాయన చెబుతున్నారు. స్థానికులు వెదురుకొక్కులను ఇంటి అవసరాలకు కొంత ఉంచుకొని, మిగలినవి వారపు సంత, వ్యాపార కూడలిల్లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. గెమ్మెలి పంచాయతీ పొత్తడిగొంది గ్రామంలోని సీఐటీయూ నాయకుడు మహేష్ తమ వ్యవసాయ భూమిలో వెదురు కొక్కులను సేకరించారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

- సర్పంచ్, సిబ్బందికి శిథిల భవనం
- సేవలకు అవస్థలు పడుతున్న ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు


ప్రస్తుతం వినియోగంలో ఉన్న శిథిల భవనం



తమ్మెంగులలో ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

చింతపల్లి: మండలంలోని తమ్మెంగులు పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగుల విధులకు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ పాలన సౌలభ్యంగా జరిగే విధంగా, ప్రభుత్వ చెంతనే ప్రభుత్వ సేవలు అందించేందుకు నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలకు అన్ని సౌకార్యాలతో కూడిన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే తమ్మెంగుల పంచాయతీకి తొలి విడతలోనే భవనం మంజూరైంది. దీంతో కాంట్రాక్టర్ మొదట్లో శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారుల ఒత్తిడితో సచివాలయ భవన నిర్మాణ పనులను పూర్తి చేశారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడం శోచనీయం. ఈ భవనం అందుబాటులోనికి రాక పోవడంతో గడిచిన ఇరవై ఐదు ఏళ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ భవనంలో ఉన్న రెండే గదుల్లో సర్పంచ్, సచివాలయ సిబ్బంది ఉంటున్నారు. వసతి సమస్య వేధిస్తోంది. సేవలు పొండానికి వచ్చిన ప్రజలు అంతా ఈ భవనంలోనే కాలం గడపాల్సిన పరిస్తితి నెలకొంటుంది.ఎన్నిమార్లు ఇంజినీరింగ్ భవనాన్ని అప్పగించాలని అధికారులను అడిగినా కాలయాపన చేస్తున్నారని, అదే కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే తమకు బిల్లు పెండింగ్‌లో ఉందని దాని కారణంగా భవనాన్ని అప్పగించలేదని సమాధానం ఇస్తున్నారని సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.